తల్లీబిడ్డల సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం


గర్భిణీని పరీక్షిస్తున్న వైద్యురాలు


మాతా శిశు సంరక్షణ (ఎంసీపీ) కార్డు

- మాతా శిశు సంరక్షణ కార్డుతో విస్తృత ప్రయోజనం
- అవగాహన కల్పిస్తున్న వైద్యులు

పెదవేగి : తల్లీబిడ్డల సంరక్షణకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. మాతా శిశు శాఖ, ఆరోగ్య శాఖల సంయుక్త నిర్వహణలో తల్లీబిడ్డల సంరక్షణే ధ్యేయంగా గర్భం దాల్చిన రోజునుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వారికి క్రమంతప్పని వైద్య పరీక్షలు అందేలా ప్రణాళికలు, వారి ఆరోగ్య స్థితిగతుల వివరాల నమోదు, గర్భస్థ సమయంలో చేయాల్సిన రక్త పరీక్షలు తదితర తల్లికి సంబంధించిన వివరాలతోపాటు ప్రసవ సమయంలో సరైన వైద్యం అందేలా జాగ్రత్తలు, బాలింత సంరక్షణ, పుట్టినశిశువు సంరక్షణకు సంబంధించిన అన్ని వివరాలు తల్లి చేతిలో ఉండేలా ప్రత్యేకంగా రూపొందించిన మాతా శిశు సంరక్షణ (ఎంసీపీ) కార్డులను ప్రభుత్వం అందిస్తోంది. దీంతో గర్భిణులు తమను తాము రక్షించుకునే విధంగా అన్ని వివరాలను పొందుపరచడంతో పాటుగా శిశువు జన్మించిన నాటి నుంచి ఐదేళ్లు వచ్చే వరకు చిన్నారుల ప్రమాదకర వ్యాధుల బారిన పడకుండా ప్రభుత్వం అందించే వ్యాక్సిన్ల వివరాలు, అవి ఎప్పుడెప్పుడు వేయించాలనే వివరాలు క్షుణ్ణంగా ఉంటాయి. మహిళల్లో ఎక్కు వగా కన్పించే గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ లక్షణాలకు సంబంధించిన ప్రాథమిక లక్షణాలను ఇందులో పొందుపరచడం వల్ల వాటిబారిన పడకుండా, వచ్చినా ప్రాథమిక దశలో సరైన వైద్యం పొందేలా వారికి ఉపయోగపడేలా ఎంసీపీ కార్డులను రూపొందించారు. దీనితో పాటుగా ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజన, జననీ సురక్ష యోజన, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవమైతే ప్రభుత్వంనుంచి అందే ఆర్థిక సాయం తదితర పథకాలు వివరాలుకూడా ఈ కార్డుల్లో వివరంగా ముద్రించారు. దీనితో ఈ కార్డులు బహుళ ప్రయోజనకరంగా ఉంటున్నాయి. నియోజకవర్గంలో పెదవేగి, దెందులూరు, పెదపాడు, మండలాల్లో మొత్తం గర్భిణులు, బాలింతలు 2,004 మంది, మూడేళ్ల లోపు చిన్నారులు 9,447 మంది, 3 నుంచి 6 ఏళ్లలోపు చిన్నారులు 11,633 మంది ఉన్నారు. పెదవేగి మండలంలో 94 అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, దెందులూరు మండలంలో 2 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 75 అంగన్‌వాడీ కేంద్రాలు, పెదపాడు మండలంలో 2 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 67 అంగన్‌వాడీ కేంద్రాలు తల్లీ, బిడ్డల సంరక్షణకు పనిచేస్తున్నాయి.

ఎంసీపీ కార్డులో పలు వివరాలు



మాతా శిశు సంరక్షణ ఎంసీపీ కార్డులు తల్లి ఆరోగ్య సంరక్షణతో పాటు బిడ్డలకు ఐదేళ్లు వచ్చే వరకు ఇవ్వాల్సిన వ్యాక్సిన్ల వివరాలుంటాయి. చిన్నారులకు వ్యాక్సిన్లు, విటమిన్ ఏ ద్రావణం కార్డులో సూచించిన విధంగా వేయించాల్సి ఉంటుంది. దీనితో పాటు బిడ్డ వయస్సు, ఎత్తు, బరువుల వివరాలు చర్ట్ రూపంలో ఉండటంతో బిడ్డల ఎదుగుదలలో ఏమైనా లోపాలు ఉంటే తల్లి స్వయంగా గమనించి వైద్యులకు తెలియజేసి సరైన వైద్యం పొందవచ్చు.

– డాక్టర్ మాధవి మండల వైద్యాధికారి, పెదవేగి మండలం

ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి సత్కారం


దెందులూరు శివాలయంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని సత్కరిస్తున్న శివాలయం చైర్మన్ పీఎల్ శ్రీనివాసరావు, పార్టీ నాయకులు

దెందులూరు: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి దెందులూరు సంతోపేట మార్కెట్‌కు ఎదుట ఉన్న శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ పీఎల్ శ్రీనివాసరావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోకల రాంబాబు, పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, ఎంపీటీసీ తాళ్లూరి నాగరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరీరాజు, దెందులూరు సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు స్వాగతం పలికారు. అనంతరం వేలాది మందికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే స్వయంగా భక్తులందరికీ వడ్డన చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ఆలయ కమిటీ ఎమ్మెల్యేను శాలువా, పూల దండతో సత్కరించి జ్ఞాపికను అందచేశారు.

క్లుప్తంగా

చల్లచింతలపూడిలో జబర్దస్త్ బృందం సందడి


చల్లచింతలపూడి శివాలయ ఆవరణలో జబర్దస్త్ టీం ప్రదర్శన

దెందులూరు: మండలంలోని చల్లచింతలపూడిలో మేదాదక్షిణామూర్తి శివాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం జబర్దస్త్ టీం అప్పారావు, వినోద్, మోహన్‌లు సందడి చేశారు. ప్రేక్షకులను స్కిట్స్ చేసి నవ్వించారు. ఈ సందర్భంగా టీం సభ్యులు మాట్లాడుతూ చిన్నకాశీగా పేరుగాంచిన దశాబ్దాల చరిత్ర, కీర్తిప్రతిష్టలుఉన్న శ్రీ మేదాదక్షిణామూర్తి శివాలయానికి తాము రావడం, స్వామివారి సన్నిధిలో పూజలు నిర్వహించడం, మీ ఆధారాభిమానాలు పొందడం, తాము ఎన్నటికి మరువలేమన్నారు. ఇంతటి అవకాశం కల్పించిన ఆలయ ఉత్సవ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. తొలుత స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: గణపవరంలో ఇటీవల మరణించిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులకు చెందిన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సోమవారం పరామర్శించారు. మారెమ్మ గుడి వద్ద ఇటీవల మరణించిన కన్నాజి నర్సమ్మ కుటుంబ సభ్యులను, బ్రహ్మంగారి గుడి వద్ద మరణించిన తోట త్రిమూర్తులు కుటుంబ సభ్యులను వాసుబాబు పరామర్శించారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, సర్పంచ్ మూర అలంకారం, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి

పెదపాడు: ఇటీవల అనారోగ్యంతో బాధపడతున్న చికిత్స పొందిన ఇద్దరు వ్యక్తులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి చెక్కులను దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి పంపిణీ చేసారు. పెదపాడు మండలంలోని నాయుడుగూడెం గ్రామానికి చెందిన దివి వాణికి రూ.60వేలు, రాజుపేట గ్రామానికి చెందిన బొబ్బా వెంకటరత్నంకు రూ.62వేలు చొప్పున సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట నియోజకవర్గ పరిశీలకుడు గుబ్బల తమ్మయ్య, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, మండల సచివాలయాల కన్వీనర్ అక్కినేని గోపీ, ఆళ్ల సతీష్ చౌదరి, రాజపేట సర్పంచ్ తొందురు క్రాంతి కుమార్, సిద్దాబత్తిన జోజమ్మ, మారుమూడి కృపామణి తదితరులు పాల్గొన్నారు.

నాగవంశీయుల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం

దెందులూరు: నాగవంశీయుల సంక్షేమ, అభివృద్ధికి తన తండ్రి కాళ్ల నర్సింహరావు (కొండమ్మ) పేరిట ప్రతి ఏటా మెరిట్ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందచేయడం జరుగుతుందని దాత కాళ్ల శ్రావణ్‌కుమార్ అన్నారు. సోమవారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ దెందులూరు మండలం ఉండ్రాజవరం గ్రామంలో పదో తరగతి విద్యార్థులు ఐదుగురు, ఇంటర్మీడియట్ విద్యార్థులు ఐదుగురికి ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున లక్ష రూపాయలను ఇటీవల అందించామన్నారు. ప్రతి ఏటా 10 మందికి మెరిట్ విద్యార్థులకు లక్ష రూపాయలు ఇస్తామని, భవిష్యత్తులో మరో 40 మంది మెరిట్ విద్యార్థులకు ఆర్థికసాయం తన తండ్రి పేరిట అందించడం జరుగుతుందని ఆయన వివరించారు.

పెదపాడులో అపరాల కొనుగోలు కేంద్రం ఏర్పాటు

పెదపాడు: మండలంలోని పెదపాడులో అపరాల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు పెదపాడు మండల వ్యవసాయ అధకారి వానపల్లి ప్రదీప్‌కుమార్ తెలిపారు.ఈ నెల 25 తేదీ నుంచి మండలంలో అపరాల కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని పెసర 8,767 ఎకరాలు, మినుము 3,266 ఎకరాల్లో కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి ఇతర రైతులకు సమాచారం అందంచాలని కోరారు.

యువకుడికి గాయాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం పెరికీడు వద్ద జాతీయ రహదారి–16పై సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఏలూరు జిల్లా పెదపాడు మండలం తాళ్లమూడికి చెందిన కోటా మధు(29) బుల్లెట్‌పై గుడివాడ వెళ్తున్నాడు. పెరికీడు ఫ్లై ఓవర్ వద్ద సర్వీసు రోడ్డులోకి వెళ్లుతున్న కారు అతని ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో బుల్లెట్ నడుపుతున్న మధుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రుడిని ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న హనుమాన్ జంక్షన్ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేశారు.

గృహ సారథులు.. సంక్షేమ వారధులు

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను తిప్పికొట్టండి


వలంటీర్లు, గృహసారథుల సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదపాడు: గృహ సారథులే పార్టీ రథ వారధులు కావాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పిలుపునిచ్చారు. పెదపాడులో వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై సోమవారం దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పచ్చపత్రికలు, చంద్రబాబు అనుచరగణం చేస్తున్న అసత్యప్రచారాలపై దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మండిపడ్డారు. పచ్చపత్రికలు, టీడీపీ నాయకుల అసత్య ఆరోపణలను తిప్పికొట్టాల్సిన భాధ్యత వలంటీర్లు, గృహసారథులపై ఉందన్నారు. గ్రామాల్లో ప్రతీ ఇంటికి 6గంటలకే పింఛను అందుతుందంటే దానికి కారణం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలేనన్నారు. కార్యకర్తల కష్ట పడి పనిచేయడం కారణంగానే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని, ఆయన ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. వలంటీర్లు ప్రభుత్వానికి–ప్రజలకు వారధులైతే, గృహ సారథులు పార్టీకి–ప్రజలకు సంక్షేమ వారధులన్నారు. సీఎం జగన్ వలంటీర్ వ్యవస్థ ద్వారా కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులకు నేరుగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని చెప్పారు. ప్రతీ సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లు, వారికి ఒక మండల కన్వీనర్ ఏర్పాటు చేసామని, దీంతోపాటు గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న వలంటీర్లు 50కుటుంబాలకు ఇద్దరు వలంటీర్లును నియామకం చేపట్టామని వారు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం ఆకుటుంబానికి ఏపథకం ద్వారా ఎంత లబ్ధి చేకూరుతుందో ఆ విషయాలను వారికి వివరించాలన్నారు. మార్చి 18నుంచి 25వరకు ఈ వారం రోజుల్లో ఇంటింటికీ గృహ సారథులు వెళ్లి ఆ ఇంటికి ప్రభుత్వం అందించే పథకాలను వివరిస్తూ మానమ్మకం నువ్వే జగనన్న అనే కార్యక్రమాన్ని ప్రజలకు వివరించాల్నారు. నియోజకవర్గంలో 114రోజుల పాటు ఇంటింటికీ తిరిగి ఆ ఇంటిలోని అక్కచెల్లెమ్మలను, అవ్వతాతలను పరామర్శించి వారికి గల సమస్యలను అడిగి తెలుసుకుని సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. గృహసారథులు వారికి కేటాయించిన ఇళ్లకు వెళ్లి వారికి ప్రభుత్వం అందించే పథకాలను వివరించి గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వానికి గల తారతమ్యం వారికి వివరించాలన్నారు, ఈ సందర్భంగా నియోజకవర్గ పరిశీలకుడు గుబ్బల తమ్మయ్య మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన సచివాలయ పరీక్షలో 20లక్షల మంది పరీక్ష రాస్తే ఏమంత్రిగాని, ఎమ్మెల్యే, ఎంపీలు కానీ సిఫార్స్‌లు లేకుండా పారదర్శకంగా ఉద్యోగాలు ఇచ్చిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. 31లక్షల మందికి ఇళ్ల స్థలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. రాష్ట్రం అభివృద్ధి, జిల్లా అభివృద్ధి, గ్రామాభివృద్ధి చెందాలంటే ప్రతీ ఒక్కరికి విద్య అవసరమని భావించి ప్రతి ఒక్కరు చదువుకు ఏటా రూ.15వేలు అమ్మవడి పథకం ద్వారా అందిస్తున్నారని గుర్తు చేసారు. ఈకార్యక్రమంలో నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా రైతువిభాగం అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, గ్రామసచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపీ చంద్ర దుర్గాప్రసాద్, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ డైరక్టరు ముదుగురు సూర్యనారాయణ, విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ డైరక్టరు కత్తుల రవికుమార్ పెదపాడు సర్పంచ్ కొత్తూరు జీవనకుమారిలు మాట్లాడుతూ గృహసారథులు, వలంటీర్లు సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో ప్రజలకు ముఖ్యమంత్రి పాలనపై అవగాహన కల్పించాలని, గత పాలకు ప్రస్తుత పాలకు గల వ్యత్యాన్ని ఇంటింటీ తెలియజేయాల్సిన అవసరముందన్నారు. ఈకార్యక్రమంలో గోగుంట సొసైటీ అధ్యక్షుడు భావరాజు సత్యన్నారాయణ,వడ్డి కార్పొరేషన్ డైరక్టరు ఘంటసాల ప్రభాకరారావు మండల ఉపాధ్యక్షులు రెడ్డి స్వర్ణకుమారి, అప్పన పద్మావతి, పాతముప్పర్రు గ్రామ సర్పంచ్ మెడబలిమి స్వరూపరాణి సంతోష్‌కుమార్, తోటగూడెం గ్రామ సర్పంచ్‌లు సిద్దాబత్తిన జోజమ్మ, చేపేని రంగారావు, ఏనుగ అబ్రహం, బోడగిరి రామకృష్ణ, మరీదు రెడ్డియ్య, ఎంపీటీసీలు కర్రె మరియమ్మ, పూడి అప్పలస్వామి, బుద్దే రామసీత, నాయకులు సంబంగి శ్రావణ్‌కుమార్, కడిమి గోవిందరావు, కొండేలాజరు, మంగర రమేష్, ఘంటసాల మోషే, సాతం కిశోర్ గుణుపూరు మహేష్, కోట గోవర్ధన్, ఇల్లూరి విజయ్, తమ్ముల బుజ్జయ్య, కంభంపాటి వెంకటసుబ్బయ్య, చింతల ఆనంద్, గుజ్జుల నవీన్, రమేష్ పాల్గొన్నారు. అబ్బయ్యచౌదరి, పరిశీలకులు గుబ్బల తమ్మయ్యలను మండల సచివాలయాల కన్వీనర్ గోపి గజమాలతో సత్కరించారు.

ఆటో యూనియన్‌కు స్థలం కేటాయింపు


వేంకటేశ్వర ఆటో యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పాము మాన్‌సింగ్

భీమడోలు: శ్రీవేంకటేశ్వర ఆటో యూనియన్ ప్రతినిధుల చిరకాల వాంఛను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాకారం చేయడం చాలా సంతోషంగా ఉందని జిల్లా చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు, వైసీపీ నేత డాక్టర్ పాము మాన్‌సింగ్ అన్నారు. భీమడోలులో సోమవారం శ్రీవేంకటేశ్వర ఆటో ఓనర్స్, వర్కర్స్ యూనియన్‌కు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆదేశాల మేరకు పంచాయతీ పాలకవర్గం ఆటో స్టాండ్‌కు స్థలం కేటాయించింది. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పాటు చేసుకున్న ఆటో స్టాండ్ స్థలంలో తొలి సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దీనితో వారంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేసారు. ఈ సమావేశానికి యూనియన్ అధ్యక్షుడు చీర సాంబశివరావు అధ్యక్షత వహించారు. తొలుత సంఘ సభ్యులు ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసారు. ఈ సందర్భంగా పాము మాన్‌సింగ్ మాట్లాడుతూ ఆటో యూనియన్ ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతం, పరిసర ప్రాంతాల ప్రజలకు ఆటో సేవలను అందిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ఆటోలను నిలుపుకునేందుకు అవసరమైన స్థలం లేక ఇబ్బందులు పడుతుండడంతో ఈ సమస్యను ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు దృష్టికి స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా తీసుకుని వెళ్లగా సానుకూలంగా స్పందించి ఇక్కడ స్థలం కేటాయించారన్నారు. యూనియన్‌లోని ప్రతి సభ్యుడు స్టాండ్ అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు మరింత సహాయ సహకారాలను అందించాలని కోరారు. యూనియన్ అధ్యక్షుడు చీర సాంబశివరావు మాట్లాడుతూ పుప్పాల వాసుబాబుకు ఆటో యూనియన్‌లోని ప్రతి ఒక్కరూ రుణపడి ఉంటారన్నారు. స్థలం మెరక చేసేందుకు దాతలు, సభ్యులు తమ సహాయ సహకారాలను అందించాలని కోరారు. అనంతరం పాము మాన్‌సింగ్‌ను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యక్షుడు ఎం.అంజి, ప్రధాన కార్యదర్శి రాచేటి యోహాన్, సభ్యులు చిన బాబు, సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై మండల స్థాయి సమీక్ష


మండల స్థాయి సమీక్షలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య

దెందులూరు: స్పందన కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అంశమని, స్పందనలో నమోదైన ప్రతి ఫిర్యాదుపై అన్ని ప్రభుత్వ శాఖాధికారులు చిత్త శుద్ధి, అంకితభావంతో సమస్య పరిష్కారానికి జవాబుదారీగా విధులు నిర్వహించాలని దెందులూరు తహశీల్దార్ ఎన్వీ నాంచారయ్య అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం స్పందన మండల కమిటీతో మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు 40 వివిధ అంశాలపై ఫిర్యాదులు నమోదయ్యాయని, 90 శాతం అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, గ్రామాల్లో ప్రజా ప్రతినిధుల సహకారంతో పరిష్కారం చేయడం జరిగిందన్నారు. మండలంలో అధికంగా జిల్లా కలెక్టర్ స్పందన నుంచి తమకు వచ్చేవి అధికంగా ఉంటాయన్నారు. అనంతరం విద్య, వైద్యం, పంచాయితీరాజ్, గృహనిర్మాణం, డ్వాక్రా, రోడ్లు, భవనాలు, ఇరిగేషన్, డ్రైనేజీ, రెవెన్యూ శాఖల వారీగా స్పందన ఫిర్యాదులు తీసుకున్న చర్యలు ఉద్యోగుల జవాబుదారితనంపై మండల కమిటీ సమీక్షించింది. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ రాజేంద్ర, ఎంఈఓ సీహెచ్ బుద్ధావ్యాస్, పీఆర్ఏఈ చౌదరి, ఏపీఎం వేణుగోపాల్, ఏపీఓ దశరదరాంజీ, ఇతర శాఖల అధికారులు, వైఎస్సార్‌సీపీ దెందులూరు గ్రామ అధ్యక్షులు పోకల రాంబాబు, కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు ఉన్నారు.

ఎన్నికల కోడ్ అమలులో అలసత్వం


కొవ్వలిలో రోడ్డుప్రక్కన తొలగించని తెలుగుదేశం జెండా

దెందులూరు: జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ కొవ్వలిలో మాత్రం పార్టీ జెండాను తొలగించకపోవడం గమనార్హం. ఈ రోడ్డుపై 8 గ్రామాల ప్రజలు ప్రతి రోజూ రాకపోకలు కొనసాగిస్తారు. గ్రామ సచివాలయ ఉద్యోగులతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు పార్టీ జెండా పక్కన నుంచే వెళుతూ, వస్తూ ఉన్నప్పటికీ జెండాను తొలగించకపోవడంపై సర్వత్రా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులు వెంటనే పార్టీని జెండాను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

22న జన్మ నక్షత్ర పూజలు

పెదపాడు: మండలంలోని అప్పనవీడులో శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థానంలో ఈనెల 22న స్వామి జన్మనక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం స్వామివారి పూర్వాభాద్రా నక్షత్రం పురస్కరించుకుని వారికి చెఱకు రసంతో అభిషేకం చేస్తున్నట్లు చెప్పారు. భక్తులు ఈకార్యక్రమంలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

గ్రామాల్లో చురుగ్గా ఫీవర్ సర్వే


గుండుగొలను బోరింగ్‌పేటలో దోమల నివారణకు మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

భీమడోలు: మండల వ్యాప్తంగా గ్రామాల్లో వైరల్ జ్వర పీడితుల పెరుగుతున్నందున వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఆదేశాల మేరకు ఫీవర్ సర్వే యుద్ధప్రాతిపదికన చేపట్టారు. ఒక్కసారిగా వాతావరణంలో చలి, ఎండల తీవ్రతలతో హెచ్చుతగ్గుల వల్ల గ్రామాల్లో చిన్నారుల నుంచి పెద్దల వరకు జ్వరాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో గుండుగొలను ఉప సర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు పంచాయతీ పరిధిలో జ్వర పీడితుల ఏరియాలను వైద్యాధికారి శ్రీలక్ష్మీ దృష్టికి తీసుకుని వెళ్లారు. ఆమె ఆదేశాల మేరకు గుండుగొలనులోని ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు, ఇతర సిబ్బందితో కలిగిన అరు బృందాలు సోమవారం బోరింగ్ పేట, దళిత కాలనీల్లోని 523 గృహాలను సందర్శించి ఫీవర్ సర్వే చేసారు. ఆరోగ్య సూత్రాలను పాటించాలని ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు ప్రజలకు సూచించారు. పరిసరాల, వ్యక్తిగత శుభ్రత పాటించాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సాధారణ జ్వరాలుగా గుర్తించి వారికి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్టు ఎంపీహెచ్‌ఈవో సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. గ్రామంలో దోమల ఉధృతి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పంచాయతీ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టింది.

రామారావుగూడెంలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి

దెందులూరు: మండలంలో మెట్ట గ్రామాల్లో తొమ్మిది గ్రామాలకు మధ్యన ఉన్న రామారావుగూడెం గ్రామంలో మినీ ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని 9 గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు. రామారావుగూడెం, మేధినరావుపాలెం, పెరుగ్గూడెం, చల్లచింతలపూడి, శ్రీరామవరం, ఖండ్రికనర్సింహపురం, కొత్తగూడెం, ఇతర గ్రామాల్లో ఏదైనా అగ్నిప్రమాదం సంభవిస్తే అటు భీమడోలు, ఇటు ఏలూరు 25 కిలోమీటర్ల నుంచి ఫైర్ ఇంజన్ వచ్చేసరికి జరిగే ప్రమాదం జరిగిపోతుందని, లక్షల్లో ఆస్తి నష్టం సంభవిస్తుందన్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని ఆయా గ్రామాలకు సౌకర్యంగా ఉండేలా ప్రమాదాలు నివారించేలా రామారావుగూడెంలో మినీ ఫైర్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి


గణపవరం జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: జగనన్న కాలనీలో స్థలం పట్టా పొందిన ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణం చేపట్టాలని, ఈ దిశగా సచివాలయ సిబ్బంది, అధికారులు లబ్ధిదారులను చైతన్యవంతులు చేయాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. సోమవారం గణపవరంలో వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో కల్పించిన సదుపాయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లక్ష్యమని, ఆ లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా అర్హత కలిగిన ప్రతి పేదవాడికి సొంత ఇల్లు నిర్మించి ఇవ్వనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని జగనన్న కాలనీలలో మంచినీరు, విద్యుత్, రోడ్ల సదుపాయాలు కల్పించామని, అందువల్ల లబ్ధిదారులంతా ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలని సూచించారు. ఈ సందర్భంగా కాలనీలో నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దండు రాము, సర్పంచ్ మూర అలంకారం, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మాదేటి సురేష్, పార్టీ నాయకులు కాకర్ల శ్రీను, రొంగల శ్రీను, తెనాలి సునీల్, కొండేటి వెంకటరత్నం, తోట శ్రీను, ఆవంతి సత్తిబాబు, చనుమూరి శివ, బత్తి శివ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గృహసారథుల ఆత్మీయ సమావేశాలు

నిడమర్రు: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం గృహసారథుల ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ సమావేశాల్లో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని తెలిపారు. ఉదయం 9 గంటలకు తోకలపల్లి, చిననిండ్రకొలను గ్రామ సచివాలయాల పరిధిలోని గృహ సారథుల సమావేశం పత్తేపురంలోని మిరియాల వెంకట్రావు అతిథి గృహంలో, ఉదయం 10.30 గంటలకు పెదనిండ్రకొలనులోని 1,2 సచివాలయాల గృహసారథుల సమావేశం జెడ్పీటీసీ కోడే కాశి కార్యాలయం వద్ద , సాయంత్రం 4 గంటలకు నిడమర్రు, మందలపర్రు గ్రామ సచివాలయాల పరిధిలోని గృహసారథులకు మందలపర్రు గ్రామంలోని ఉమా నీలకంఠేశ్వర ఆలయ కల్యాణ మండపం వద్ద ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసినట్లు సత్యకుమార్ తెలిపారు. ఆయా సచివాలయాల పరిధిలోని గృహసారథులు తప్పనిసరిగా హాజరుకావాలని మండల సచివాలయాల సమన్వయకర్త నౌడు వెంకట అచ్యుతరామారావు కోరారు.